# దీపావళి కానుక

కుమారి టి. సుశీల

ఆ రోజు ఆదివారం ; ప్రసాదు పడక కుర్చీలో కునుకుతూ పేపరు చదువు తున్నాడు. ఇంతలో పోస్టువాడు రెండు వుత్తరములు తెచ్చియిచ్చాడు. ఒకటి మామగారు తొలి దీపావళికి రమ్మని వ్రాసినది ; రెండవది భార్య సరోజిని వ్రాసింది. ఉత్తరాలు చదువగానే ప్రసాదు వుప్పొంగి పోయాడు ; కాని, వెంటనే తన పరిస్థితులు మెదడుకు తట్టగానే వుత్సాహం కొద్దిగా చల్లబడింది. అత్తవారింటికి వెళ్ళాలంటే-అందులోను మొదటి తూరి పండుగ, మామూలుగా వెళ్లితే ఏం బాగుంటుంది. పోసీ టిప్‌టాప్‌గా వెళదామంటే డబ్బేది ?....ఎలాగైన సరే వెళ్ళక తప్పదను కున్నాడు.

సాయంకాలం ప్రసాదు మిత్రుడు మూర్తివద్దకు వెళ్లాడు. మూర్తి ఆగర్భశ్రీమంతుడు. చాల సరళహృదయుడు కూడాను. ఇది వరకు యెన్నో మార్గు ప్రసాదుకు సహాయము చేశాడు. ఇప్పుడు ప్రసాదుకు ముఖ్యంగా కావలిసింది ఒక రిస్టువాచి. ఈ కాలంలో స్కూలు ఫైనలు స్టూడెంటే వాచి కట్టుకుంటూవుంటే తను వుద్యోగం (కొద్దిదో, గొప్పదో) చేస్తుంటే వాచేనా లేక పోవడం చిన్నతనమనిపించింది. వాకిట్లో మూర్తి దర్శనమైంది. ఒక ఘంటసేపు బాతాఖాని సాగించాడు. కాని, అసలు సంగతి ప్రస్తావించడానికి ప్రసాదుకు సంకోచము కలిగింది. ఎలాగై తేనేం, ఆఖరికి, 'మూర్తి! నాకు నీ రిస్టువాచి కావలెనోయి' అన్నాడు.

"ఏం, సినిమా కెళ్తున్నావా ?

"సినిమాకు వెళ్లడానికి అంత ముస్తాబెందుకోయి ! విజయనగరం వెళ్తున్నా."

"అదా సంగతి. యిదివరకు నే నెప్పుడు కాని, యెవరికి నా వాచి యివ్వ లేదు. ఇలాంటి లావాదేవీలనుంచే friendship పాడైపోతుంది."

"ఏదో, ఈ దఫా యిచ్చేయి. తప్పకుండా వారం రోజుల్లో నీ కప్పజెపుతా."

"సరే కాని జాగ్రత్త సుమా" అని తన గోల్డు వాచి, చెయినుతో సహా యిచ్చాడు.

పండుగకు ముందు రోజే ప్రసాదు అత్తవారిల్లు చేరుకున్నాడు. గుమ్మం తొక్కి తొక్కక ముందే, బావమరదుల కళ్లు వాచిపైనే పడ్డాయి. 'ఏం బావగారు! వాచి క్రొత్తదా? ఎంత ?' అన్నారు. పాపం ప్రసాదు తడవుకుంటూ '250' అన్నాడు. ప్రక్క గదిలో నుంచి వింటున్న సరోజని మురిసి పోయింది.

పండుగ బాగా జరిగింది. మరుసటి రోజు సాయంత్రము ప్రసాదు ప్రయాణం.

"ఏం, మీరు తప్పక రేపే వెళ్లాలిసిందేనా?" అని ఆవిడగారు అన్నారు.

"అవును ; ఇంక శెలవు లేదు. అసలు ఈ మారు ప్రయాణం చాలహడావిడైంది. నీ కేమి తేలేక పోయాను. చూడు నీ కేంకావాలో చెప్పు నేను వెళ్లి పంపుతా" అన్నాడు గర్వంగా

## నేటి కథ

"అబ్బే, నా కేమి అక్కర లేదు. త్వరగా యిల్లు కుదిర్చి నన్ను తీసుకెళ్లండి" అని ప్రాధేయ పడింది ఆమె.

"ఇంటి కొరకు నేను చాలప్రయత్నిస్తున్నా. అయినా, నీ కేదైనా బహుమానం యివ్వాలని వుంది. ఏమి కావాలో కోరుకో" అని బలవంత పెట్టాడు.

"నా కక్కర్లేదండీ" అన్నది.

"నా మీద ఒట్టు, చెప్పు" అని గడ్డంపట్టు కున్నాడు.

"అలాగైతే, మళ్లా ఖర్చు పెట్టి కొనడ మెందుకు? మీ రిస్టువాచి బాగుంది. ఆదే యిచ్చేసేయండి" అని కోరింది.

ప్రసాదు అలాగే చూస్తూ నిలబడి పోయాడు. అతని భావం సరోజిని గ్రహించిది. "అబ్బే, అక్కర్లేదండి. మీ రంత బలవంత పరిస్తే అడిగాను" అని సర్దుకుంది.

"అందుకు కాదు. తరచు ఆఫీసుకు Late అయిపోతుందని వాచి కొన్నాను" అని తడుము కోకుండా బొంకాడు.

"నాకక్కర లేదన్నాను గదూ" అన్నది. కాని, ఆమె ముఖముపై నిరాశ స్పష్టంగా కన బడుతూ నేవుంది.

అది చూడగానే ప్రసాదు, 'సరే, దీనికింత చిన్న పుచ్చుకోవడ మెందుకు? నువ్వే తీసుకో అన్నాడు. మాట వరసకి ప్రయాణం హడావిడిలో సరోజినికి వాచీ బహుమానం మాట జ్ఞాపకం వస్తుందా అనీధీమాతో.

సాయంకాలం ప్రసాదు వాచి కోసం వెదకు తున్నాడు. అంతలో భార్య, 'ఏమండీ! నా చేతి కెలాగుంది' అంటూ వాచి చూపిస్తూ గదిలో ప్రవేశించింది. బాగుందన్నట్లు తల వూపాడు. ఎక్కడి లైట్ కార్నరులో పడ్డాను రా అని గిలగిలా కొట్టుకున్నాడు.

ఊరు చేరు కొన్న సాయంత్రం ప్రసాదు మొగం దమ్మిడీ అంత చేసికొని మూర్తి యింటికి వెళ్లాడు. Very sorry మూర్తి I could not help it! అని మొదలెట్టాడు.

"ఏమిటి జరిగిందోయి?"

"విజయనగరం నుంచి వస్తుంటే Train లో నీ వాచీ పోయింది. ఎలా పోయిందో తెలియ లేదు. Very sorry. But I will bear the cost"

"వెధవది cost కాదోయి. అది చాల యేండ్లగా నా వద్దవుంది. అందుకనే యివ్వనన్నా. ఊ....జరిగిందేదో జరిగింది. కాని, డబ్బివ్వడ మేమిటిలే.

"ఇక ఆ సంగతి వదిలేయి. అత్తవారింటి విశేషాలేమిటో చెప్పు" అంటూ ఏమి జరుగ నట్లుగానే మాటలు మొదలెట్టాడు. అతని వుదారత చూచి ప్రసాదు తనను తానే నిందించు కున్నాడు. సిగ్గుపడి పోయాడు.

దాదాపు ఒక సంవత్సరము గడిచింది. కాని, ప్రసాదుకు యిల్లు దొరకలేదు. తమ యింటిలోనే వుండమని మూర్తి యెన్నోమార్లు చెప్పినా వాచి భయం చేత ప్రసాదు ఒప్పుకో లేదు.

ఒక రోజు సాయంత్రం యెదురయ్యాడు. 'ఏమోయి ప్రసాదు ఈ మధ్య యెక్కడ అగు పడటమే లేదే' అన్నాడు.

"ఏదీ ఇల్లు వెదకడటంతోటే సరిపోతూంది. ఇవాళ వుత్తరం వచ్చింది. పైవారం దీపావళి యని, అంతలో యిల్లు కుదిర్చి తన్ను తీసుకు వెళ్లమని. లేక నన్నైన పండుగకి రమ్మని సరోజిని వ్రాసింది. కాని, క్రిందటి దీపావళి ముచ్చట మరువ లేదు. నేను వెళ్లను" అంటూ ఉదాసీనంగా వెళ్లి పోయాడు.

మూర్తి సంగతంతా భార్యతో చెప్పాడు. తమ యింటిలోనే వసతి వున్నందున, ప్రసాదు భార్యను రమ్మన మన్నాడు. కాని, ప్రసాదు దీనికి సమ్మతించడని తెలిసి, అతనికి చెప్ప లేదు.

రేపు దీపావళి. ఎక్కడ యిల్లు దొరక లేదని విచారిస్తున్నాడు. ప్రసాదుకు ఇంతలో సరోజిని వుత్తరం వచ్చింది. మూర్తిని, అతని భార్యను ప్రశంసిస్తూ, తను బయలు దేరానని, మధ్యాహ్నము స్టేషన్‌లో కలసుకొమ్మని వ్రాసింది. వెంటనే, మూర్తి యింటికి వెళ్లి, సంగతి ఏమని అడిగాడు. అంతా తెలిసింది. స్టేషన్‌కు నేను వస్తానన్నాడు మూర్తి. ప్రసాదు కాదన లేక పోయాడు. రిస్టువాచి తలచు కుంటే హడలుగానే వుంది. ఇక జీవితంలో యెప్పుడు ఎరువు తెచ్చుకోనని, అబద్ధమాడనని, ఈ మారుయెలాగైన తప్పించ మని భగవంతుని ప్రార్థించాడు.

ఇద్దరు స్టేషకు వెళ్లారు. రైలు Platform లోనికి వచ్చిది; సరోజిని, చేతిని వాచితో సహా బండిలోంచి దిగింది. ప్రసాదుగుండె గుభాలు మంది. సామానులు దింపించి, కూలీలతో బేర మాడుతున్నట్లు నటించాడు.

సరోజనిని బండిలో యింటికి పంపి, మిత్రులిద్దరు నడవటం ప్రారంభించారు.

"ఒరేయి ప్రసాదు! Never mind. నిరుటి పండుగకు నా వాచి నీకు ఎరువిచ్చాను. ఈ తూరి నా guest అవడం చేత సరోజినికి వాచీ Present చేస్తున్నాను" అన్నాడు.

ఈ దీపావళి కానుకకి సంతోషించాలో ఏంచెయ్యాలో ప్రసాదుకి తెలియ లేదు.

★



రచయిత
టి. సుశీలాదేవి

ఆంధ్ర మహిళా సభ విద్యాశాఖ కార్యక్రమంలో వుత్సాహంతో పాల్గొనుచున్న సోదరీమణులలో కుమారి టి. సుశీలాదేవి ఒకరు. ఈమె స్కూలు ఫైనలు ప్యాసు కాగానే మా హిందీ శాఖలో అ, ఆలు నేర్చి ప్రాథమిక మొదలు రాష్ట్రభాష వరకు పరీక్షలు ప్రథమ తరగతిలో, కొన్ని రాజధానికి ప్రథమముగాను కృతార్థురాలయింది. ఈ మధ్యనే జరిగిన పట్టపరీక్ష 'విశారద'లో ప్రథమ తరగతిని విజయం పొందింది. హిందీ చదువుకొంటూనే యింగ్లీషు కృషిచేసి, ప్రావీణ్యతను పొంది మా బెనారెస్ మెట్రిక్ జ్యూనియర్ తరగతికి వుపాధ్యాయినిగా సేవచేస్తోంది.

మొన్న ఆగస్టులో జరిగిన హిందీ పరీక్షలలో రాష్ట్రభాష పరీక్షకు హాజరయిన మా సభ్యురాండ్రు శ్రీమతులు కె. సుగుణమణి, నూతలపాటి శారదాంబగార్లు యిరువురూ కృతార్థులయారు. శ్రీమతి చర్ల జానకీదేవిగారు మధ్యమ పరీక్షలో కృతార్థులయారు. వీరందరికీ 'ఆంధ్ర మహిళ' అభివందనాలు.

★